ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ లో వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

- వచ్చే నెల నుంచి సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ కేంద్రాలు ప్రారంభించనున్నామని బిసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.

- యువత ప్రతిభకు గుర్తింపు లభించేందుకు యువజనోత్సవాలు వేదికగా నిలుస్తాయని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణణ్ అన్నారు.

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోస్తా తీరం వెంబడి డ్రోన్ టెక్నాలజీతో లైడర్ సర్వే నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు.

==================

దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ లో వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని తీసుకొచ్చి అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన ఓ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవలను చివరి వ్యక్తి వరకు అందించాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కృత్రిమ మేధ, డీప్ టెక్నాలజీ ఉపయోగించి అన్ని రంగాల్లో పరిష్కారాలు వెతకొచ్చని తెలిపారు. 'నిశ్శబ్దాన్ని ఛేదించండి, ఎయిడ్స్ కోసం మాట్లాడండి' అనే నినాదాన్ని గతంలో ఇచ్చిన తాను, ఇప్పుడు 'నిశ్శబ్దాన్ని ఛేదించండి – జనాభా నిర్వహణ కోసం మాట్లాడండి' అని పిలుపునిస్తున్నానని అన్నారు. ప్రధాని మోడి నేతృత్వంలో దేశం ఆర్థికంగా బలంగా తయారవుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ ..

బైట్ .. CM చంద్రబాబు నాయుడు (37 సెకన్లు)

====================

యువత ప్రతిభకు గుర్తింపు లభించేందుకు యువజనోత్సవాలు వేదికగా నిలుస్తాయని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణణ్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన 'యువ ఉత్సవ్`2024' వేడుకలను కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన, సృజనాత్మకత, దేశభక్తిని పెంపొందించడమే ఈ ఉత్సవాల ఉద్దేశమని తెలిపారు. ఇటువంటి ఉత్సవాలలో పాల్గొని నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, భారతదేశ అభివృద్ధికి, ఐకమత్యానికి యువత పాటుపడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

====================

విశ్వసనీయత, వాస్తవాలు, సమాజ ప్రయోజనాలు వార్తా రచనల్లో ప్రతిబింబించాలని శ్రీకాకుళం డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్- ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని పేర్కొన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఈరోజు జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వార్తా మాధ్యమాలు సేకరించిన సమాచారంలో ఖచ్చితత్వాన్ని రూఢి పర్చుకొన్న అనంతరం వార్తను ప్రజలకు చెరవేయాలని అభిప్రాయ పడ్డారు.

==================

విరామం

==================

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కరపత్రాలను తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో ఈ రోజు

ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు.

పిటిసి – తిరుపతి జిల్లా

===================

బలహీన వర్గాల అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా డిఎస్సీ ఉచిత శిక్షణా కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని బిసి సంక్షేమ శాఖమంత్రి ఎస్.సవిత అన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలలో ఉచిత డిఎస్సీ శిక్షణా కేంద్రాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు కూడా వచ్చే నెలలో ఉచిత శిక్షణా కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించనుందని పేర్కొన్నారు. తాజా రాష్ట్ర బడ్జెట్ లో 39 వేల 7 కోట్ల రూపాయలను బలహీన వర్గాల కోసం కేటాయించామని మంత్రి తెలియజేస్తూ..

బైట్.. మంత్రి సవిత(23 సెకన్లు)

===================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోస్తా తీరం వెంబడి డ్రోన్ టెక్నాలజీతో లైడర్ సర్వే నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. తీరం వెంబడి ఉన్న కాలువల, సముద్రపు ప్రవాహం మూలంగా పంట పొలాలకు సంభవించే ముంపు బెడద నివారించేందుకు పూర్వపు, ప్రస్తుత భౌగోళిక స్థితిగతులను శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

===================

ఉపాధి అవకాశాలకు తగ్గట్టుగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి పనిచేయనున్నట్లు విశాఖపట్నం జిల్లా ఒకటవ జోన్ రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి అనిల్ కుమార్ తెలిపారు.

===================
===================